కథ

కోలపల్లి ఈశ్వర్

# కొత్త ఉత్తరం

ఉత్తరం రాయటం ముగించి, ఆ ఇన్‌లాండ్ లెటర్ అంచుని నాలుకతో తడిపి అంటించేశాక, దాన్ని బల్లమీదున్న డిక్షనరీలో పెట్టి కుర్చీలోంచి లేచాను.

ఆదివారం కాబట్టి ఆఫీసు లేదు.

పొద్దుట్నుంచి ఒంటరిగా ఇంట్లోనే కాలం గడిపానేమో, కాసేపలా ఎటైనా బైటికి వెళ్లొస్తే బావుంటుందనిపించింది.

అనిత లేకపోవటం చాలాపెద్ద లోటే.

కానీ భరించాలి..కొన్నాళ్లపాటు..తప్పదు!

ఇంట్లో అనిత లేకపోవటంవల్ల వరసగా గత అయిదు రోజుల్నుంచి, ఆఫీసయ్యాక అట్నుంచటే ఏదన్నా సినిమాకు వెళ్లొస్తున్నాను. అంచేత ఇవ్వాళ సినిమాకు కూడా వెళ్లబుద్ధి కావటం లేదు. కానీ ఎంతసేపని ఇలా ఒంటరిగా కూర్చోవటం? టీవీ ఉంటే అదో దారి. ఏదో ఒక ఛానెల్లో ఏదో ఒక ప్రోగ్రాం చూస్తూ గడిపేయొచ్చు. కానీ అది కాస్తా నాలుగు రోజులక్రితం చెడి కూర్చుంది. రిపేరుకిద్దాం ఇద్దాం అనుకుంటూనే రోజూ బద్ధకించేస్తున్నాను. సెల్ కాస్తా పది రోజులుగా ఫ్రేమ్ చెడిపోయిందని, ఎనిమిది వందలు ఇస్తే రిపేరు చేస్తానని వాడంటే-మౌనంగా తిరుగుతున్నాను. ఇంకొంత డబ్బేసి కొత్తది కొనుక్కోవటం మేలని ఊరుకున్నాను. అదీగాక సెల్‌మీద నాకంత ఇంట్రెస్ట్ కూడా లేదులే.

కొంతమంది పుస్తకాలతో రోజుల తరబడి కాలక్షేపం చేసేయగలుగుతారు. కానీ నేనయితే పట్టుమని ఓ పది వాక్యాలు కూడా చదవలేను. పొద్దున్న పూట ఆఫీసులో న్యూస్ పేపర్ చూసినా అలా అలా హెడ్‌లైన్స్ చూసి వదిలేయటమే.

పోనీ అలా సెంటర్ దాకా వెళ్లి ఓ ఛాయ్ కొట్టేస్తే కాస్త రిలీఫ్‌గా ఉంటుందేమోననిపించి....లుంగీ, బనీన్లలోంచి ప్యాంటు, షర్ట్‌లోకి మారి ఇంటికి తాళం వేసి రోడ్డెక్కాను.

విద్యానగర్ లోకల్ రైల్వేస్టేషన్‌కి చాలా దగ్గరలోనే మా ఇల్లు.

తీరా రోడ్డెక్కాక ఛాయ్ తాగాలన్న ఆలోచనను విరమించుకుని ఊరికే అలా స్టేషన్‌కేసి దారితీశాను.

సిటీలో లోకల్ రైల్వేస్టేషన్లలో సాయంత్రం పూట రిటైర్డ్ ఉద్యోగులు సిమెంట్ బెంచీల మీద కూర్చుని రాజకీయాల్లో మరొకటో, మరొహటో ముచ్చటిస్తుంటారు సాధారణంగా.

నేను ఆఫీసుకు వెళ్ళేటప్పుడు సిటీబస్‌లోనే వెళ్లినా, వచ్చేటప్పుడు మాత్రం లోకల్ ట్రెయిన్ లోనే వస్తుంటాను. సాయంత్రం వేళల్లో సిటీబస్సులు మరీ రద్దీగా ఉంటాయ్. నుంచోవటానికి కూడా చోటుండదు. లోకల్ ట్రెయిన్‌లో అయితే ఆ ప్రాబ్లముండదు. అఫ్‌కోర్స్ ఉదయం వేళల్లో కూడా సిటీబస్సుల పరిస్థితి అదే కానీ అప్పుడు తప్పదు. ఎందుకంటే-లోకల్ ట్రెయిన్‌ని నమ్ముకుంటే ఇన్‌టైమ్‌లో ఆఫీసుకు చేర్తామన్న నమ్మకం ఉండదు.

అదే గనక ఓ స్కూటర్ ఉంటే..అసలే సమస్యా ఉండదు. ఒక్క ఆఫీసుకనే కాదు, ఎక్కడికి పోవాలనుకుంటే అక్కడికి ఇంచక్కా ఎప్పుడుపడితే అప్పుడు నిముషాల మీద వెళ్లి రావచ్చు.

ఓ యాభై అరవై గజాల దూరం వెళ్లాక ఓ పధ్నాలుగేళ్ల అబ్బాయి మల్లెపూలమ్ముతూ ఎదురయ్యాడు నాకు.

మల్లెపూలని చూడగానే చటుక్కున అనితే గుర్తొచ్చింది నాకు. ఇంకా ఎన్నాళ్లో ఈ ఎడబాటు. కానీ ఏం చేస్తాం? ఎడబాయాలి...తప్పదు.

నేను స్టేషన్‌కెళ్లి ఖాళీగా ఉన్న ఓ సిమెంట్ బెంచీమీద కూర్చున్నాను.

పక్కనే ఉన్న మరో బెంచీమీద ఇద్దరు ముసలాళ్లు కూర్చొనున్నారు. ఇద్దరికిద్దరూ రిటైర్డ్ బడి పంతుళ్లలాగే కనిపించారు.

"నేను శంషాబాద్ స్కూల్లో పనిచేసే రోజుల్లో..."

ఇద్దర్లో ఒకాయన అలా అనటంతో నా అంచనా కరెక్టయినందుకు పిసరంత గర్వంలాంటిదో మరేమిటో కలిగి...ఊరికే ఓ చెవిని అటుకేసి పారేశాను.

"ఏంటీ నువ్ శంషాబాద్‌లో కూడా చేశావా? ఏ ఇయర్లో?"

"నైన్‌టీన్ నైన్ ఫైవ్ టు టూథౌజండ్ టూ..ఆ స్కూల్లో నాతోపాటు కామేశ్వరరావ్ అని ఒకాయన చేసేవాడు. అదుగో ఆ దౌర్భాగ్యుడే తెచ్చిపెట్టాడు నా నెత్తినా కుంపటి"

"అంటే...అతని ద్వారా వచ్చిందా ఆ సంబంధం?"

"అవును. కుర్రాడు బాగున్నాడు కదా..చదువూ, ఉద్యోగమూ ఉన్నాయి కదాని నేను చటుక్కున గోతిలో దిగిపోయాను. నిష్కారణంగా నా కూతురి గొంతు కోశాను. వాడింత నీచుడనిగానీ, ధనపిశాచని గానీ నేనూహించలేకపోయాను"

"నీ అల్లుడొక్కడే కాదులే రాఘవా! చాలా మంది ఈ రోజుల్లో అలాగే తయారయ్యారు. తెల్లారి లేస్తే పేపర్లో ఎన్ని వరకట్నం చావుల గురించి చదవటం లేదు మనం. పెళ్లప్పుడు గుంజేది గుంజుతూనూ ఉన్నారు, ఆ తర్వాత అత్యాశతో ఇంకా తెమ్మని వేధించి చంపుతూనూ ఉన్నారు. ఇదంతా చూస్తుంటే యువతరంలో రాన్రానూ నీతి నియమాలు నశించిపోతున్నాయేమోననిపిస్తోంది. మనకాలంలోనూ కట్నాలుండేవి కానీ ఇలా అదనపు కట్నం కోసం అగ్రులు చాచటం...కట్టుకున్న ఇల్లాల్ని కిరసనాయిలు పోసి తగలబెట్టడం ఉండేవి కావు...అవునా?"

"ఆ మాటంటే నేనొప్పుకోను..మంచీ, చెడూ

అనేవి ఎప్పుడూ ఏ కాలంలోనూ ఉంటాయి. ఇప్పుడు కొడుకు కోడల్ని తగలబెడుతుంటే సహకరిస్తున్న అత్తలూ, మామలూ ఆ కాలపువాళ్లు కారా? అంతెందుకూ మనుషులంతా ఒకేలా ఉండరనటానికి నిదర్శనం మా చిన్నల్లుడే..అతన్నాకు అల్లుడిలా కనిపించడు, అనిపించడు కూడా. కన్నకొడుకేననుకో. పెళ్లప్పుడు నా సంతోషం కొద్దీ నేనేమిచ్చానో అంతే! ఆ తర్వాత నా నుండి ఏనాడూ ఒక్కపైసా కూడా ఆశించలేదు. పైగా నేను వద్దన్నా కూడా ఎప్పుడైనా తనే నా అవసరాలకు అడ్డుపడుతూ ఉంటాడు"

"అది మీ చిన్నమ్మాయి చేసుకున్న అదృష్టం"

"అవునలాగే అనుకోవాలి మరి. ఆ త్రాష్టుడికి పెళ్లప్పుడు నలభై తులాల బంగారమే కాక నాలుగు లక్షల కట్నం కూడా ఇచ్చాం. పైగా అడిగిన వస్తువులన్నీ ఇచ్చాం. అది చాలదన్నట్టు ఏటేటా ఏదో ఒక క్రొత్త డిమాండ్! అదేమంటే దాన్ని తన్ని నా దగ్గరికి పంపించేయడం...స్కూటరు, ఫ్రిజ్జు, వాషింగ్‌మెషిన్, కలర్ టీవీ, ఎయిల్ కూలర్ ఎన్ని కోర్కెలని తీర్చగలను నేను మాత్రం? పాపం పిచ్చి తల్లి..పెళ్లయిన ఆరేళ్లకే అరవై ఏళ్ల నరకం అనుభవించింది వాడితో"

"అవును పాపం. ఇంతకీ మొన్నెలా చేసి పంపావు?"

"నా పరిస్థితి నీకు తెలియందేముంది సీతారాం! ఉన్నదల్లా ఆ ఒక్క ఇల్లు. దానిమీద ఒకటిన్నర లక్షల అప్పు. ఇంకొక్క పైసా కూడా ఇవ్వనని మొరాయించాడు కానీ. ఆ నర్సింగ్‌నే మళ్లీ కాళ్లు పట్టుకుని వేడుకుంటే, ఇంకో పదివేలిచ్చాడు. దానికితోడు ఇంట్లో ఉన్న టేకుమంచమూ, బీరువా అమ్మేస్తే ఇంకో మూడు వేలు పోగయ్యాయి. అయినా కూడా ఇంకో రెండున్నర వెయ్యి తక్కువ పడితే చెప్పుకుంటే సిగ్గుచేటు..మా చిన్నల్లుడు సర్దుబాటు చేశాడు"

"కనీసం చిన్నల్లుడైనా మంచివాడు దొరికాడు. అక్కడికదే అదృష్టమనుకోవాలి రాఘవా నువ్వు!"

"లేదు సీతారాం. మంచివాడన్నది మా చిన్నల్లుడి విషయంలో చాలా చిన్నపదం..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయిన రాఘవగారు ఠక్కున ఆగిపోయాడు ఓ పదిహేనేళ్ల కుర్రాడు చేతిలో ఏదో కాగితం పట్టుకుని పరుగెత్తుకు రావటం చూసి.

"తాతయ్యగారూ, తాతయ్యగారూ! మీకీ టెలిగ్రాం వచ్చింది. పోస్ట్‌మేన్ మా ఇంట్లో ఇచ్చేసి వెళ్లిపోతే, మీరు రోజూ ఈవెనింగ్ ఇక్కడే ఉంటారు కదాని ఇక్కడికి తెచ్చాను" ఆ కుర్రాడు వగరుస్తూ, తన చేతిలోని కాగితాన్ని రాఘవగారికందించాడు.

"టెలిగ్రామా?" అంటూ దాన్నందుకున్న రాఘవగారు అందులోకి దృష్టిసారించి "లలితా" అని బిగ్గరగా అరుస్తూ వెనక్కి వాలిపోయాడు.



ఆయన చేతిలోని టెలిగ్రాం గాలికి ఎగిరొచ్చి నా కాళ్ల దగ్గర ఆగిపోయింది.

నేను చటుక్కున దాన్నందుకుని కుతూహలంగా అందులోకి చూశాను.

"యువర్ డాటర్ కమిటెడ్ సూయిసైడ్! స్టార్ట్ ఇమ్మీడియట్లీ" సత్యనారాయణ.

అంతసేపూ వాళ్ల సంభాషణను చాలా ఆసక్తిగా తిలకించి ఉన్నానేమో ఆ లలిత ఎవరో నాకు తెలియకపోయినా, అంటే నేనెరిగున్న మనిషి కాకపోయినా అప్రయత్నంగా నా కళ్లు చెమ్మగిల్లాయ్. మనసు బాధగా మూలిగింది.

నేను దిగ్గున లేచి వాళ్లున్న బెంచీ దగ్గరికి వెళ్లాను.

రాఘవగారిలో చలనం లేదు.

"రాఘవా! రాఘవా!" అంటూ ఆయన్ను కుదుపుతున్న సీతారాంగారు నన్ను చూసి నా చేతిలోని టెలిగ్రాం నందుకుంటూ "ఈ టెలిగ్రాం చూసి ఈయనిలా పడిపోయారు. హార్ట్ ఎటాక్‌లా ఉంది. కొంచెం బైట దాకా సాయం పట్టావా బాబూ..హాస్పిటల్‌కి తీసుకెళ్దాం" అన్నాడు అర్థింపుగా.

నేను మౌనంగా తలూపి రాఘవగార్ని రెండు చేతుల్తోనూ లేపి భుజాన్న వేసుకుని, స్టేషన్ బైటికి దారితీశాను.

రాఘవగార్ని ఆటోలో చేర్చాక "సారీ మాస్టారూ! నేను మీకు తోడుగా రాలేకపోతున్నాను. నాకు వేరే అర్జంటు పనుంది" అన్నాను బాధగా సీతారాంగారితో.

ఆయన ఫర్వాలేదన్నట్టు తల ఊపాడు.

ఆటో ముందుకు దూసుకుపోయింది.

నేను డాక్టర్ని కాకపోయినా నాకు చాలా స్పష్టంగా తెలిసిపోయింది. సీతారాంగారితోపాటు ఆ ఆటోలో వెళుతున్నది రాఘవగారి భౌతికకాయం మాత్రమేనని.

ఆటో కనుమరుగయ్యే దాకా అక్కడే నిలబడ్డ నేను ఆ తర్వాత పరుగులాంటి నడకతో ఇల్లు చేరుకున్నాను.

ఇంటికి రాగానే నేను చేసిన మొట్టమొదటి పని, తాళం తీశాక, రేపు పోస్ట్ చేద్దామని బల్లమీద డిక్షనరీలో ఉంచిన ఉత్తరానికి నిప్పు పెట్టటం.

ఆ ఉత్తరం తగలబడిపోతుంటే దాంతోపాటే నాలోని రాక్షసాంశ కూడా తగలబడిపోయింది.

ఉత్తరం బూడిద ఫ్యానుగాలికి నల్లటి తుంపులు తుంపులుగా గదంతా కలయదిరుగుతుంటే, నేను బల్ల సొరుగులోంచి మరో ఖాళీ ఇన్‌లాండ్ లెటర్‌ని బైటికి తీసి అనితకు కొత్త ఉత్తరం రాయటం ప్రారంభించాను.

"డియర్ అన్నూ!

నన్ను క్షమించు. మీ నాన్న నాకు స్కూటర్ కొనిస్తేనే నీతో కాపురం చేసేదంటూ నిన్ను మీ ఇంట్లో వదిలేసి వచ్చినందుకు నేనిప్పుడు చాలా సిగ్గుపడుతున్నాను.

సిటీ బస్సుల్లో రోజూ నానా అగచాట్లు పడలేక, నా సంపాదనతో నేనెలాగూ ఇప్పట్లో స్కూటర్ కొనుక్కోలేను కాబట్టి నీ ద్వారా మీ నాన్న మీద తీవ్రమైన ఒత్తిడి తెస్తే ఆయన ఏ పాట్లో పడి స్కూటర్ కొనివ్వక పోతాడా అన్న అత్యాశతో నీ మీద నాకున్న ప్రేమను తాత్కాలికంగా చంపుకుని నేనంత హేయంగా ప్రవర్తించాను.

మరో ఆర్నెల్లాగితే పంట డబ్బులేవో చేతికొస్తాయనీ, అప్పుడు కొనిస్తాననీ మొన్న మీ నాన్నగారంటే - అయితే అప్పుడే పంపించండి మీ అమ్మాయినంటూ నేను వచ్చేశాను కదా! ఇప్పుడు మీ నాన్నగారితో చెప్పు..ఆరు నెలల తర్వాత కాదు సరికదా, అసలెప్పటికీ స్కూటర్ కొనివ్వాల్సిన అవసరం లేదని. ఎందుకంటే మీ నాన్నగారి నుండి స్కూటర్ తీసుకుని, ప్రాణంలేని ఆ వాహనం కోసం నా ప్రాణప్రదమైన నీ హృదయంలో ఓ అత్యాశపరుడిగా ఎప్పటికీ మిగిలిపోవటం నాకిష్టం లేదు కాబట్టి. నాలోని ఈ మార్పుకి కారణం.. నువ్వు మనింటికొచ్చాక నీతో స్వయంగా చెప్తాను. త్వరగా వచ్చేస్తావు కదూ?

నీ...ఎప్పటికీ

ప్రదీప్"

ఈసారి ఈ ఇన్‌లాండ్ లెటర్ అంచుని నేను నాలుకతో తడపలేదు.

చెమ్మగిల్లిన కన్నులుండగా నాలుకెందుకు?



# ఆంటీ అని పిలవను!

అనిల్ కపూర్ కూతురు కుర్రతార అయిన సోనమ్ కపూర్ ఓ ఫంక్షన్‌లో 'ఆంటీ' అని ఐశ్వర్యారాయ్‌ని పిలిచినట్టు ఆ 'వరస'కి ఐష్ మేడమ్ తెగ యాంగ్రీ అయినట్టు వార్తలొచ్చాయి. వయసురీత్యా చూస్తే ఇద్దరికీ చాలా తేడా వుండడం వల్ల సోనమ్ అలా పిలిచి వుండొచ్చు అనుకున్నారు. కానీ ఐష్ అలా అనుకోలేదు కదా! అయితే తాజాగా సోనమ్ ఓ స్టేట్‌మెంటిచ్చింది. 'నేను ఐశ్వర్యారాయ్‌ని సినిమా నటిగా ఎంతో గౌరవిస్తాను. పైగా నేనెప్పుడూ ఆమెను 'ఆంటీ' అని పిలవలేదు, పిలవను కూడా' అంది. ఎందుకొచ్చిన గొడవ అని కాబోలు!